క్లుప్తంగా

బాబాకు ఏకాదశ రుద్రాభిషేకం



అనంతపల్లి షిర్డీ సాయి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకంలో పాల్గొన్న మహిళలు

నల్లజర్ల: అనంతపల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవం మూడో రోజైన గురువారం ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. తాడేపల్లిగూడెంకు చెందిన వేద పండితుడు బ్రహ్మశ్రీ నుదురుపాటి శ్రీసూర్యశర్మ ఆధ్వర్యంలో ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యావచనం, మహాన్యాసం కార్యక్రమాలు జరిగాయి. జీవ నదుల పుష్కర జలాలతో, విశేష ద్రవ్యాలతో 108 కలశాలతో ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. విశేష సంఖ్యలో భక్తులు బాబావారి ఏకాదశ రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

ఆశీలు వసూలు వేలం ఖరారు



తాళ్లపూడి పంచాయతీ ఆఫీసు వద్ద ఆశీలు వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: స్థానిక పంచాయతీ పరిధిలో ఆశీలు వసూలు చేసుకునే హక్కుల కోసం గురువారం వేలం పాట నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఆశాఆలేఖ్య ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా గతంలో కంటే అదనంగా రూ. పది వేల ఆదాయం వచ్చింది. రోజువారీ ఆశీలు వసూలుకు వేలం నిర్వహించగా రూ.1.92 లక్షలు, ప్రతి వారం ఆశీలు వసూలుకు రూ.40 వేలకు పాడుకున్నారు. ఈ వేలం పాటలో నామన పరమేశ్వరరావు, అముజూరి సూర్యనారాయణ, జడ్డు శ్రీనివాస్, గంటా చిరంజీవి, స్వామినాయుడు, వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గోపాలపురం: పెద్దాపురం గ్రామంలోని భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద గురువారం ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించారు. నవధాన్యాలు, నవరత్నాలు, పంచలోహాలతో విశిష్ట పూజలు నిర్వహించి ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఎకరాకు 14 బస్తాల వేరుశనగ దిగుబడి



సగ్గొండలో వేరుశనగ పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

గోపాలపురం: మండలంలోని సగ్గొండ గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు గురువారం వేరుశనగ పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఎకరాకు 14 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ఏఎస్‌ఓ జోడాల వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు లభించడమే గాకుండా భూసారం కూడా పెరుగుతుందన్నారు.

వేళ్లచింతలగూడెంలో బడిబాట ర్యాలీ



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గోపాలపురం: మండలంలోని వేళ్లచింతలగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఆ గ్రామంలోని బడిఈడు పిల్లలను గుర్తించి, వారిని బడిలో చేర్పించడానికి బడిబాట ర్యాలీ ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్టు ప్రధానోపాధ్యాయిని ఎన్‌సీహెచ్ రత్న కుమారి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న పథకాలను వివరిస్తూ ర్యాలీలో విద్యార్థులు ప్ల కార్డులు ప్రదర్శించారు. అలాగే ప్రభుత్వ బడులు ముద్దు.. ప్రైవేటు బడులు వద్దు అంటూ నినాదాలు చేశారు. సీఆర్పీ కొయ్య నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: మండలంలోని శెట్టిపేటకు చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ గురువారం తెలిపారు. శెట్టిపేటకు చెందిన కాపకాయల నవ్యయశస్వి ఒక ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. కాలేజీకి అని చెప్పి ఈనెల 27న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీనిపై ఆమె తల్లి సత్యమాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

మొక్కజొన్న.. లాభాలు మిన్న

- మెట్ట ప్రాంతంలో రబీలో ఆరుతడి పంటగా..
- కొవ్వూరు డివిజన్‌లో 6,375 ఎకరాల్లో సాగు
- ఎకరాకు 45 క్వింటాళ్ల దిగుబడి
- రూ.60 వేల నుంచి రూ.70 వేల ఆదాయం



దేవరపల్లిలో సాగు చేసిన మొక్కజొన్న పంట

దేవరపల్లి: తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంట మొక్కజొన్న. మెట్ట ప్రాంతంలో రబీ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు ఆరుతడి పంటగా మొక్కజొన్ననే సాగు చేస్తున్నారు. బోర్ల కింద కూడా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. విత్తనం వేసిన 120 నుంచి 130 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఖరీఫ్ వరి పంట కోసిన భూముల్లో మొక్కజొన్న వేస్తున్నారు. మార్కెట్లో మొక్కజొన్నలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది రైతులు వరికి బదులు మొక్కజొన్న వేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. కొవ్వూరు డివిజన్‌లోని ఎనిమిది మండలాల్లో 6,375 ఎకరాల్లో 2024 రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట వేశారు. నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, నిడదవోలు, పెరవలి మండలాల్లో ఈ పంట సాగు చేశారు. నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో పంట వేశారు. ప్రస్తుతం మొక్కజొన్న కోతలు జరుగుతున్నాయి. దేవరపల్లి మండలం పల్లంట్ల కేంద్రంగా మొక్కజొన్నను ఎగుమతి చేస్తున్నారు. మొక్కజొన్న సాగు లాభసాటిగా ఉంది. ప్రైవేట్ కంపెనీలు రైతులను ప్రోత్సహించి పంట వేయించి విత్తనం కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది అధిక వర్షాలకు పంట దెబ్బతినడం వల్ల పెట్టుబడి ఎక్కువ అయ్యిందని రైతులు తెలిపారు. ఈ పంటను ఎక్కువగా కత్తెర పురుగు ఆశించి నాశనం చేస్తోందని తెలిపారు. ఈ ఏడాది పురుగు బెడద లేకపోవడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. పండించిన పంటలో 80 శాతం విత్తనానికి కంపెనీలు కొనుగోలు చేస్తుండగా, 20 శాతం కమర్షియల్ పంట ఉంది.

కొవ్వూరు డివిజన్‌లో సాగు వివరాలు	
మండలం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
గోపాలపురం	3656
దేవరపల్లి	412
నల్లజర్ల	1306
కొవ్వూరు	122
చాగల్లు	50
నిడదవోలు	93
పెరవలి	9
తాళ్లపూడి	723
మొత్తం	9375

ఆర్బీకేల ద్వారా కొనుగోలు

రైతులు పండించిన మొక్కజొన్నను రైతుభరోసా కేంద్రాల్లో మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ప్రతి ఆర్బీకే వద్దా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాల వద్ద కంటే బయట మార్కెట్లో ఎక్కువ ధర లభించడంతో రైతులు బయట అమ్మకాలు జరుపుతున్నారు. జిల్లాలో వరి తర్వాత ప్రధాన పంటగా రైతులు మొక్కజొన్న పండిస్తున్నారు. మొక్కజొన్నను చేపలు, కోళ్లు, పశువులకు దాణాగా, ఆహారంగా, పేలాలు, స్వీట్‌కార్న్ రూపంలో వినియోగిస్తున్నారు.



దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ఆరబెట్టిన మొక్కజొన్న కండెలు

సాగుపై రైతుల ఆసక్తి



మొక్కజొన్న పంట సాగుపై మెట్ట ప్రాంత రైతులు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి పోను రూ.60 వేల నుంచి రూ.70 వేలు మిగులుతుంది. కొవ్వూరు డివిజన్‌లోని ఐదు మండలాల్లో రబీలో 6,375 ఎకరాల్లో పంట వేశారు. మార్కెట్లో మొక్కజొన్నలకు గిరాకీ ఉంది. క్వింటాల్‌కు రూ.2200 నుంచి రూ. 2400 ధర ఉంది. గతేడాది క్వింటాల్ మొక్కజొన్న ధర రూ.2,500 పలికింది. ప్రస్తుతం పంట కోతలు జరుగుతున్నాయి. పంట రైతులకు లాభసాటిగా ఉంది.

–పి. చంద్రశేఖర్, వ్యవసాయ సహాయ సంచాలకుడు, కొవ్వూరు

పంట లాభసాటిగా ఉంది



మొక్కజొన్న పంట లాభసాటిగా ఉంది. దిగుబడులు బాగున్నాయి. ఎకరాకు 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.రెండు ఎకరాల్లో పంట వేశాను. ప్రస్తుతం కోత జరుగుతోంది. రబీలో లాభసాటి పంట మొక్కజొన్న. రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ధర గిట్టుబాటుగా ఉంది.

– లంకా అప్పారావు, రైతు, అనంతపల్లి, నల్లజర్ల మండలం

నేడు బల్లిపాడులో 'తలారి' ఇంటింటా ప్రచారం

కొవ్వూరు: తాళ్లపూడి మండలం బల్లిపాడు గ్రామంలో శుక్రవారం ప్రజా ఆశీర్వాదం కార్యక్రమం పేరుతో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

కోతుల దాడిలో బాలికకు గాయాలు



గాయపడిన బాలిక

గోపాలపురం: కోతులు జరిపిన దాడిలో ఓ బాలిక గాయపడింది. ఈ ఘటన మండలంలోని పెద్దాపురంలో గురువారం చోటుచేసుకుంది. తాళ్లపూడి గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు పొగాకు పనుల నిమిత్తం పెద్దాపురానికి వలస కూలీలుగా వచ్చారు. తల్లిదండ్రులు పొగాకు పనులు చేస్తుండగా, సమీపంలోనే ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలికపై కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేసింది. దాంతో ఆ బాలిక తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఆ బాలికను గోపాలపురం సీహెచ్‌సీకి తరలించగా ఆమెకు తలకు 8 కుట్లు వేసినట్టు డాక్టర్ హేమకుమార్ తెలిపారు. మండలంలోని గోపాలపురం పరిసర గ్రామాల్లో కోతుల బీభత్సం సృష్టిస్తున్నా సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ హయాంలోనే బీసీలకు సామాజిక న్యాయం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు 'గూడూరి'



విలేకరులతో మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

దేవరపల్లి: సామాజిక న్యాయం చేస్తామని అనేక పార్టీలు ఎన్నికల సమయంలో ప్రకటించి నప్పటికీ అమలుకు నోచుకోలేదని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలు చేసి చూపించారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. దేవరపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాజిక న్యాయం, రాజ్యాధికారం, బీసీల ఆత్మగౌరవం అనే పేర్లతో అన్నివిధాలుగానూ బీసీలకు జగన్ అండగా నిలబడ్డారన్నారు. బీసీల పిల్లలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేరి, ఇంగ్లిషు చదువు కోలేకపోతున్నారని గుర్తించిన జగనన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి ఇంగ్లిషు చదువుకొనే అవకాశం కల్పించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచారని గుర్తు చేశారు. కులాలవారీగా బీసీల గణన జరగకపోవడం వల్లే దేశంలో రిజ్వరేషన్ల అమలుకు విఘాతం కలుగుతోందని వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. కులాలవారీగా జనగణనకు అన్ని రాష్ట్రాలు అసెంబ్లీలలో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినప్పటికీ బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని ఆయన అన్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తన ప్రసంగంలో తమ పార్టీల జెండాలు వేరైనా, అజెండా మాత్రం ఒక్కటేనని ప్రకటించారని గుర్తు చేశారు. ఈ లెక్కన బీజేపీ బాటలోనే పయనిస్తున్న టీడీపీ, జనసేన పార్టీలు బీసీల గణనకు వ్యతిరేకమో? అనుకూలమో? చెప్పాలని గూడూరి ప్రశ్నించారు. కులగణనకు మద్దతుగా అసెంబ్లీలో తీర్మానం చేసిన వైఎస్సార్ సీపీకి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలు అండదండగా ఉంటారని ఆయన తెలిపారు. మే 13న జరగుతున్న ఎన్నికల్లో గోపాలపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనిత, రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగనన్నకు బహుమతిగా ఇస్తామని తెలిపారు.

అందుబాటులో ఉంటా.. ఆదరించండి



గోపాలపురం మండలం రాంపాలెంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి వనిత

- హోం మంత్రి తానేటి వనిత
- రెండు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

గోపాలపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇకముందు కూడా కొనసాగాలంటే మరలా ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు గుర్తించారని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత కోరారు. మండలంలోని గంగోలు పంచాయతీ పరిధిలోని రాంపాలెం, రాజంపాలెం గ్రామాల్లో గురువారం ఆమె పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఈ రెండు గ్రామాల ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన మేలు గురించి వివరించారు. కరపత్రాలు అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు మించి, సంక్షేమ పథకాలు అందించారని మంత్రి వనిత అన్నారు. ప్రతి ఒక్కరికీ తాను అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని రెండు గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రచారంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకుల పాటి లలిత, వైఎస్సార్ సీపీ నాయకులు పోతిరెడ్డి నాగరాజు, యండపల్లి కవిత, ఎస్కే వల్లీ, కురుకూరి ధనలక్ష్మి, కప్పల వరలక్ష్మి , పార్టీ మండల నాయకుల పాల్గొన్నారు.

వారి కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

- జిల్లా సమగ్ర శిక్ష , విద్యాశాఖ అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ సుభాషిణి
- కొవ్వూరులో శిబిరం నిర్వహణ



కొవ్వూరు ప్రత్యేక శిబిరంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను పరీక్షిస్తున్న వైద్యుడు

కొవ్వూరు: జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా సమగ్ర శిక్ష , విద్యాశాఖ అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. జిల్లా సమగ్ర శిక్ష , విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం కొవ్వూరు ప్రభుత్వ బాలుర కళాశాలలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సమగ్ర శిక్ష భవిత కేంద్రాల ద్వారా అనేక రకాలైన సేవలు అందిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల భవిత కేంద్రాల ద్వారా సహాయం పొంది, చదువుకుంటూ జీవితంలో స్థిరపడాలన్నదే ప్రభుత్వం ఉద్దేశం అన్నారు. నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం, తాళ్లపూడి, కొవ్వూరు మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, వారి తల్లిదండ్రులు ఈ శిబిరానికి హాజరయ్యారు. ఐడియాలజీకి సంబంధించి ఎక్కువ మంది హాజరైనట్టు ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ ఎస్.కనకబాబు తెలిపారు. ప్రత్యామ్నాయ పాఠశాలల కో–ఆర్డినేటర్ రాణి, ఎంఈవో–1 జె.కెంపురత్నం, ఎంఈవో–2 కిషోర్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్సుపర్సన్లు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నిడదవోలు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని మసీదు వద్ద రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో గురువారం 50 మంది పేదలకు దుప్పట్లు, పండ్లు, డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గుంటిపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, గొన్నబత్తుల రామారావు, షేక్ చిన్న జిలాని, షేక్ అహ్మద్, ఇస్మాయిల్‌ఖాన్, షేక్ అన్వల్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ
- 24వ వార్డు ఎస్టీ కాలనీలో ఎన్నికల ప్రచారం



నిడదవోలు ఎస్టీ కాలనీ వాసులకు కరపత్రాలను అందిస్తున్న కౌన్సిలర్లు, పార్టీ నాయకులు

నిడదవోలు: నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అందరూ అండగా నిలవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కోరారు. పట్టణంలోని 24వ వార్డు ఎస్టీ కాలనీలో కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులను వార్డు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ పేదల సంక్షేమం , ప్రతి ప్రాంతం అభివృద్ధి లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లు సుపరిపాలన అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, పార్టీ బీసీ నాయకుడు గంగుల గోపియాదవ్, జేసీఎస్ కన్వీనర్ ఎస్కే చాన్‌బాషా, కౌన్సిలర్లు మానుపాటి లక్ష్మి, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆరుగొళ్లు వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు తోలేటి కోటేశ్వరరావు, ఆలమూరి రాజా, విపర్తి కిషోర్, బి.నాగేంద్ర, కోటగిరి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్వారీ కార్మికుల సమ్మె



దేవరపల్లి మండలం దుద్దుకూరులో సమ్మె చేస్తున్న క్వారీ సింగిల్ లారీ కార్మికులు

దేవరపల్లి: నూతన వేతన ఒప్పందాన్ని కోరుతూ దేవరపల్లి, కొవ్వూరు మండలాల్లోని క్వారీ సింగిల్ లారీలపై పనిచేస్తున్న కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం ఆరో రోజుకు చేరుకుంది. గతంలో చేసుకున్న వేతన ఒప్పందం కాలపరిమితి పూర్తి కావడంతో నూతన వేతన ఒప్పందం చేయాలని కార్మికులు యజమానులకు పలు డిమాండ్లతో కూడిన నోటీసు ఇచ్చారు. దీనిపై యజమానులు, కార్మిక సంఘాల మధ్య ఈ నెల 21న జరిగిన చర్చల్లో వేతనాల పెంపునకు యజమానులు నిరాకరించారు. దాంతో ఈనెల 22 నుంచి కార్మికులు సమ్మె చేపట్టారు.రెండు మండలాల పరిధిలోని దుద్దుకూరు, గౌరీపట్నం, లక్ష్మీపురం, కొండగూడెం, బందపురం, ఐ.పంగిడి, దేచర్ల ప్రాంతాల్లోని నల్లరాతి క్వారీల్లోని లారీలపై సుమారు 700 మంది కార్మికులు పని చేస్తున్నారు. కార్మికుల సమ్మెతో ఎక్కడి లారీలు అక్కడే నిలిచిపోయాయి. మెటల్, పాల్స్ (రాళ్లు) రవాణాకు ఆటంకం ఏర్పడింది. కులనిర్మూల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కొండారెడ్డి గురువారం సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని ఈ సందర్భంగా కొండారెడ్డి సూచించారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్, కులనిర్మూల పోరాట సమితి జిల్లా నాయకుడు ఎం.జానరాజు తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి హోమ్ ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, సెక్టార్ అధికారులకు గురువారం జేసీ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో హోం ఓటింగ్ కోసం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. వాటి ప్రకారం సదరన్ ధ్రువపత్రాలు ఉన్న 18 ఏళ్లు నిండిన ఓటర్లు, 85 ఏళ్లు నిండిన వృద్ధులను గుర్తించి, వారికి హోం ఓటింగ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికోసం ఫారం 12డి ఫారాలు సిద్ధం చేయాలన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

'సాక్షి'తో మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి



రాంభూపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

నిడదవోలు: వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేస్తూ చర్యలు చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పట్టణ శివారు ప్రాంతాల ప్రజలకు సైతం తాగునీటి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ సాధారణ నిధులు రూ.60 లక్షలతో వేసవి కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. మంచినీటి పైప్‌లైన్ నిర్వహణ, బోర్లు, మోటార్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్టు వివరించారు. బోర్ల మరమ్మతుల సమయంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో 15 హెచ్‌పీ సామర్థ్యం గల ఆరు మోటార్లు కొనుగోలు చేశామన్నారు. వీటిని మంచినీటి పంపు హౌస్ వద్ద సిద్ధంగా ఉంచామన్నారు. పట్టణంలోని బాలాజీనగర్, ఎంవీ నగర్, నెహ్రూనగర్ మంచినీటి రిజర్వాయర్ల వద్ద మూడు జనరేటర్లను సిద్ధం చేశామని తెలిపారు. మంచినీటి పైపులైన్లు, పంపుల నిర్వహణ కోసం ముందస్తుగా సాధారణ నిధులు రూ. 5 లక్షలు కేటాయించి, ఇప్పటికే టెండర్లను కూడా పిలిచామన్నారు. వేసవిలో నీటి వాడకం అధికంగా ఉన్నప్పటికీ, ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ప్రస్తుతం ఇంద్రానగర్, నంగాలమ్మ గుడి వద్ద సాధారణ నిధులు రూ.18 లక్షలతో రెండు బోర్లు నిర్మిస్తునట్టు చెప్పారు. ఎక్కడైనా పట్టణ శివారు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడితే నీటిని సరఫరా చేసేందుకు మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌తో పాటు రెండు ప్రైవేట్ ట్యాంకర్లను సిద్ధంగా ఉంచామన్నారు. జగనన్న కాలనీ వాసులకు తాగునీటి నీటి సమస్య లేకుండా రోజూ ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నట్టు కమిషనర్ రాంభూపాల్ రెడ్డి చెప్పారు. పట్టణ పరిధిలోని 70 మంచినీటి చేతిపంపులకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

నిడదవోలులో సాయుధ దళాల కవాతు



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న సాయుధ దళాలు

నిడదవోలు: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిడదవోలు సర్కిల్ పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు సంయుక్తంగా పట్టణంలో గురువారం సాయుధ దళాల కవాతు నిర్వహించాయి. స్థానిక గాంధీనగర్‌లో ప్రారంభమైన ఈ కవాతు ఎన్టీఆర్ కాలనీ, ఎంవీ నగర్, సుబ్బరాజుపేట, తీరుగూడెం, ఆంజనేయపురం ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా పట్టణ ఎస్సై పులపా అప్పారావు మాట్లాడుతూ పౌరులు శాంతియుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకొనేందుకు పోలీసు శాఖ అన్ని విధాలా అండగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవడానికి పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు.

